304) కాంభోజి

ప॥ ఐనట్టయ్యీఁగాక హరికల్పితము లివి । మానేటి వేటివో మానని వేవో ॥

చ॥ వొక్కరు తలచినట్టు వొకరితలపు రాదు । పక్కన నందరికి బహుభావాలు ।
అక్కట మొద లొకటి అనలుగొనలు వేరు । యెక్కడని తగిలేది యేమిసేసేది ॥

చ॥ పొరుగువానిచేత ఆపొరుగువాడు మెచ్చఁడు । నరులకర్మములు నానావిధాలు ।
గరిమ నన్ని మొక్కటే కడుపుతనివి వేరు । కరుణించౌనన నేవి కావన నేవి ॥

చ॥ కడగి దరిద్రునిమాట కలవాని కింపుగాదు । బెడగు జీవుల పొందు పెక్కురీతులు ।
కడుశ్రీవేంకటేశు డొక్కఁడు జగత్తులు వేరు । వొడిగట్టుకొనే దేది వొల్లననే దేది ॥